# పరువు

"చిన్నారి చిలకమ్మ దూరంగా ఎగిరిపోతే....

గూడంతా గోలయిపోదా....కొమ్మా కోనా చిన్నబోదా...."

అంటూ కీర్తన సన్నగా రాగం తీయగానే, అక్కడున్న ఫ్రెండ్స్ లో ఓ ముగ్గురు అమ్మాయిలు గట్టిగా అరిచినట్లు మూడు భాషల్లో జవాబు చెప్పారు...

" పోదూ...పోనే పోదూ....

నో...నెవ్వర్....

నహీ...కభీ నహీ...."

వాళ్ళ వైపు కీర్తన చురుగ్గా చూసింది.

ఇంకొక అమ్మాయీ వెంటనే అడిగింది..." పాత పాటకి చింతాకంత నీ సొంత కవిత్వం కలిపి పేరడీ బాగానే చేశావుగానీ...నువ్వు పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్తోంటే, మేం అంతా దిగులెందుకు పడాలీ..? "

కీర్తన లానే దీర్ఘం తీస్తూ కోమలి అనబడే అమ్మాయి దీర్ఘం తీసింది. " గోరింక గూటికే చేరేవేళ నీకు దిగులెందుకే చిలుకా...బంగారుమొలకా...! "

ఇంకొకమ్మాయీ వెంటనే " అవునే ...పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్ళటమనేది అందరికీ జరిగేదే...కొంచెం ముందూ వెనకగా...అంతే కదా...! ఆ మాత్రానికే నీకీ గోలా, గగ్గోలూ ఎందుకు చెప్పూ...?" అంటూ మాటల్ని సాగదీసింది.

వెంటనే ఇంకొక అమ్మాయి అందుకుంది " కుబేరుడి కొడుకు లాంటివాడు కోరి నిన్ను చేపట్టబోతోంటే...ఏదో కష్టం వచ్చినట్లు బాధ పడటం ఎందుకో నాకర్థంకావటం లేదు ! "

కీర్తన నిట్టూర్చింది. " చేపట్టటం కాదే,చెరపట్టాలనుకుంటున్నాడు ! తనతో స్నేహంగా తిరగటానికి ఒప్పుకోలేదని...పెళ్ళి పేరుతో ఇంకోదారిన వచ్చాడన్నమాట ! చూడటానికని వచ్చినరోజే నిశ్చితార్థమంటూ భారీ నగానట్రా పెట్టేసరికి మా అమ్మ మురిసిపోయింది ! వాళ్ళ అధికారంతో తన పరపతి పెరిగి ప్రమోషన్ రావటం సులువవుతుందని మా నాన్న వాళ్ళకి దాసోహమైపోయాడు ! నా అంగీకారాన్ని ఎవరూ అడగాలేదూ ! అభ్యంతరాల్ని లెక్క చేయాలేదూ ! " అంటూ ఇంకా ఏదో అనబోతూ అలికిడికి గుమ్మం వైపు చూసింది. అక్కడ చేతిలో పుస్తకాలతో సంజన  నిలబడి ఉంది !

" మా రూంలో అందరూ చేరి గోలగోల చేస్తుంటే, నేను ఇక్కడ కూర్చుని ప్రశాంతంగా నోట్సు రాసుకుందామని వస్తే....ఇక్కడా అలాగే ఉందిగా..!" అంది కొంచెం నిరాశగా మొహం పెట్టి.

కీర్తన చకచకా తన దగ్గరికి వెళ్ళి చేయిపట్టుకుని లోపలకు తీసుకువచ్చి వాళ్ళకి కొంచెం దూరంలో ఉన్న టేబుల్ దగ్గర కూర్చోబెట్టింది.

" మేం ఖాళీగా ఉండి...ఏదో కాలక్షేపం కబుర్లు వెళ్ళబోసుకుంటున్నాంలే ! ఇంతమాత్రానికే నువ్వేం వెళ్ళిపోనక్కరలేదు. ఇక్కడ కూర్చుని చక్కగా నీ పని నువ్వు చేసుకో...అంటే....చెవులు మూసేసుకుని చేతులతో రాసేసుకో...! మేం కూడా మా కబుర్లకు కొంచెం సౌండ్ తగ్గించి గుసగుసలుగా మార్చుకుంటాంలే ! " అంది అభిమానం చూపిస్తున్నట్లుగా.

" మామూలుగా కంటే...గుసగుసలుగా అయితేనే ఎవరికైనా ఆసక్తి పెరిగి చెవులు రిక్కించి వినాలపిస్తుంది..తెలుసా ! " అని ఒకమ్మాయి మెల్లగా గొణిగింది.

ఇంకొకరిద్దరు కూడా మెల్లగా గుసగుసలు పోయారు..." చూశావా..కీర్తన ఈ పెళ్ళి తనకు ఇష్టం లేదంటూనే, కాబోయే అత్తవారికి బాగా దగ్గిర బంధువని సంజన పట్ల ఎంత ఆదరం చూపిస్తోందో...!" అంటూ.

కీర్తన మళ్ళీ వాళ్ళ దగ్గిరకు వచ్చి కూర్చుని " మనం మన కబుర్లు కానిద్దాం...! ఇపుడు చెప్పండి...మనం ఎక్కడ బ్రేక్ వేసాం ? " అనడిగింది ఫ్రెండ్స్ వైపు చూస్తూ.

" నీ పెళ్ళి విషయం మీ వాళ్ళందరికీ ఇష్టమేననీ..నీకు మాత్రమే అభ్యంతరాలున్నాయని చెబుతున్నావు...అక్కడ ఆగాం..! " అంటూ కోమలి వివరణ ఇచ్చి " అయినా నాకు తెలియక అడుగుతున్నానుగానీ నీకు మాత్రం ఎందుకు ఇష్టం లేదూ..? వాళ్ళకి ఐశ్వర్యం, అధికార హోదా అన్ని ఉన్నాయి ! ఆపైన...మన కాలేజీవాడే మనకు సీనియర్ కాబట్టి, బాగా తెలిసిన వాడు కూడా కదా..మరి  నీకెందుకూ అభ్యంతరం..? " అనడిగింది.

కీర్తన " ఏం చెప్పమంటావే...." అంటూ నిట్టూర్చింది. ఒక క్షణం మౌనంగా ఉండి మళ్ళీ మొదలుపెట్టింది.

" మనసైన వాడిని మరిచిపోలేక...మనువాడాల్సిన వాడిని మనసులోకి రమ్మనలేకా, నేనెంత సతమత మవుతున్నానో ఎవరికీ అర్ధం కావట్లేదు. మీకే కాదు, మా తల్లి, చెల్లి అండ్ తంబీ కి కూడా..! "

" ఏమిటీ...! " అంటూ అందరూ ఒక్కసారే తృళ్ళిపడ్డట్టుగా ఆశ్చర్యపోయారు ! " నీకూ ఓ ప్రేమ వ్యవహారం ఉందా..? మాకెవరికీ తెలియకుండానే..!! " అన్నారు కోరస్ గా.

కోమలి గొంతు సవరించుకుని " ఎవడు వాడు....ఎచటివాడు...నీ మనసు దోచిన అందగాడు..?" అంటూ ప్రశ్నార్ధకంగా చూసింది.

వాళ్ళంతా మామూలుగా మాట్లేడుస్తున్నారని " ఉష్ " అంటూ కీర్తన నోటిమీద చూపుడువేలు ఉంచుకుని సంజన వైపు చూసి సైగ చేసింది.

" అవును...ఇన్నాళ్ళూ గుట్టుగా దాచావుగానీ, నీ ప్రేమ కధను ఇపుడైనా మాకు వివరించాల్సిందే...తప్పదు ! " ఇంకో ఇద్దరు ముగ్గురు నొక్కి వక్కాణిస్తున్నట్లుగా అన్నారు.

" సరే...సరే...చెబుతాను...! " అంది కీర్తన మెల్లగా.

" మామూలు ప్రేమ  కధే..! నేనీ హాస్టల్ లో చేరకముందు ఇంటినుండే కాలేజికి వచ్చేదాన్నికదా...ఆ రోజుల్లో మా పక్కింటివాళ్ళ మేడగదిలో ఒకతను అద్దెకు దిగాడు.   "

కీర్తన మాటలకు అడ్డొచ్చి ఒకమ్మాయి " అతనెలా ఉంటాడేం...? " అనడిగింది.

కీర్తన కొంచెంగా తలవంచుకుని ముసిముసి నవ్వులు చిందించింది.

“ అబ్బో.....సిగ్గు చాలుగానీ...అడిగిందానికి జవాబు చెప్పు...” చిన్నగా కసిరిందొక అమ్మాయి.

“ సిగ్గుకాదుగానీ...మాటల్లో ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాలే...ఒక్క మాటలో చెప్పాలంటే....'నవ్వు రాజిల్లెడు మేమువాడు...మువ్వ గోపాలునికి మరో రూపంగా అనిపించెడివాడూ'...” అంటూ కీర్తన మళ్ళీ చిరునవ్వులు చిందించింది.

“ సరేగానీ...ఎప్పుడు, ఎక్కడ, ఎలా పరిచయం కలిగి ప్రేమగా మారిందో ఆ కథ చెప్పు త్వరగా...” ఉత్కంఠ భరించలేకపోతున్నట్లుగా తొందరపెట్టిందొక అమ్మాయి.

“ అలా తొందరపెడితే ఎలాగే...? ఆలోచించుకొంటూ నిదానంగా చెబుతా...! ” అంది కీర్తన.

“ ఆలోచన ఎందుకూ...జరిగింది జరిగినట్లు చెప్పటానికీ ?”   ఒకమ్మాయికి ఈ సందేహం వచ్చింది.

“ బావుంది...సంవత్సరం క్రిందటి సంగతులు కదా, గుర్తు చేసుకుంటూ చెప్పాలిగా...ఆపైన ఏవి చెప్పవచ్చునో, ఏది చెప్పకూడదోనన్నదీ కూడా ఉంటుందిగా...! ” అంది కీర్తన.

“ ఎలాగోలా ముందు మొదలుపెట్టవే...” అంటూ అందరూ కలిపి తొందరపెట్టారు.

మళ్ళీ కీర్తన తన ప్రేమ కథ కొనసాగించింది.

“ నేనొకరోజు కాలేజి నుండి బస్టాండు కి నడిచి వస్తోంటే...ఎవరో నా పర్సు లాక్కుని పరుగెత్తాడు. అపుడు ఆఫీసునుండి ఆ దారిన వస్తున్న మా పక్కింటి మేడమీద అబ్బాయి ...అతనిని వెంబడించి పట్టుకుని, రెండు తన్ని, నా పర్సు తీసుకు వచ్చి ఇచ్చాడు.

అప్పటినుండీ మా పరిచయం పెరిగింది. నేను సెలవురోజుల్లో ఉప్మా చేసి అతనికివ్వటం అలవాటైంది. అతను నేను చేసిన ఉప్మా రుచిని మెచ్చుకుంటే...నేనేమో ఉప్మాని అంత ఇష్టంగా తినే అతని అభిరుచిని మెచ్చుకునేదాన్ని...ఇలా పరస్పరం ప్రశంసల్ని ఇచ్చిపుచ్చుకోవటంలో...మాలో ప్రేమ మొలకెత్తి ...మహావృక్షంగా మారింది...! ”

“ కొంచెం ఆగవే..” అంటూ ఒకమ్మాయి కీర్తనని హెచ్చరించి...మిగతా అందరివైపూ చూసి “ ఈ ఉప్మా ప్రేమ కథని చాలాసార్లు విన్నట్టుగాలేదూ...?” అనడిగింది.

కీర్తన చురచురా చూసింది. “ అదేదో సినిమాలో ఒక హీరో తను ఒక్కసారి చెబితే, వందసార్లు చెప్పినట్టేనని అంటాడా, అలా నేనూ ఒకసారి చెప్పగానే, నీకేమో వందసార్లు విన్నట్లుగా అనిపిస్తోందన్నమాట ! అంటే...నా మాటల్లో అలా అనిపించే చాతుర్యమేదో ఉందన్నమాటేగా...కొంచెంసేపటి తర్వాత చాలాసార్లు చూసినట్లుగా కూడా అనిపిస్తుందేమో...! ” అంది వ్యంగ్యంగా.

“ ఇదంతా ఎందుగ్గానీ...మీ విషయం మీ పెద్దవాళ్ళకి చెప్పలేదా..?” ఒకమ్మాయి అడిగింది.

కీర్తన వెంటనే జవాబు ఇచ్చింది “ చెప్పాంగానీ షరామామూలే అన్నట్లు ఒప్పుకోలేదు....ఇంతలో అతనికి ఏదో ట్రైనింగుకి వేరే ఊరు వెళ్ళి కొన్నాళ్ళుండాల్సి రావడంతో, గది ఖాళీ చేశాడు ! ”

“ సరేలే...చాలా పాత ప్రేమ కథలా చప్పగా ఉంది ! అయితే అక్కడితో మీ ప్రేమ కథకి ఫుల్ స్టాప్ పడిపోయిందిగా..మరి నువ్వు చక్కగా ఈ పెళ్ళి చేసుకోవచ్చుగా ! కావాలంటే....అత్తారింట్లో

అపుడపుడూ ' అంతా భ్రాంతియేనా ' అంటూ పాటలూ పాడుకుంటూ ఉండు...! " ఇది ఒకమ్మాయి సలహా.

కీర్తన వెంటనే రాగం తీస్తూ జవాబు చెప్పింది.

" నేనా టైపుకాదులే ! ' అంతా భ్రాంతి కాదూ...జీవితాన వెలుగెంతో ఉందిలే...ఆశల తీరం చేరేవరకూ పయనించటమే నా వంతు కదా...ఆ పైదంతా నీ తంతేగా...ఓ..దేవదేవా...' అని పాడుకునే రకాన్ని ! నా లక్ష్యం వేరే ఉంది...సాధిస్తానుగా ! " అంటూ ధీమాగా చూసింది అందరివైపు.

"ఈసారి నీ సొంత కవిత్వం చింతాకంత కాదు, విస్తరాకంతగా విస్తరించిందిగానీ....నీ కోరిక ఎలా తీరుతుందే..? అతగాడు మకాం మార్చేసాడుగా ...! " అంది కోమలి.

" మకాం మారినంత మాత్రాన మనసులు దూరమైపోవు...ఫోనులో మాట్లాడుకుంటూనే ఉన్నాం . ఒక ఆలోచన ఉందిలే..మంచిరోజు చూసుకుని ముహుర్తాలు పెట్టుకుందామని వాళ్ళు కబురు చేశారు. ముహుర్తానికి ముందే మేం జంప్ అయిపోతాం! వాళ్ళిచ్చిన నగలు ఉన్నాయిగా...బ్రతకటానికి భరోసాగా కొన్నాళ్ళ వరకూ ఫరవాలేదు. నిదానంగా అతను ఇంకో ఉద్యోగం చేసుకుంటాడు ! రహస్యం సుమా..! " అంటూ స్వరం బాగా తగ్గించి, తమ ప్లాను వివరించింది.

" అమ్మో...నీకు ఎంత ధైర్యమే...! పరువు పోదూ..! " ఒకమ్మాయి విస్తుపోతే, కీర్తన అంది " మరి...ఏం చేయమంటావే, మా ప్రేమని ఒప్పుకోమని బ్రతిమాలినా వినలేదు. మాకు ఇంకో దారి కనిపించటంలేదు. పరువు సంగతి పెద్దవాళ్ళు ఆలోచించుకోవాల్సిన విషయం ! "

సంజన తన పుస్తకాలు సర్దేసుకుని " నా పని పూర్తయిందిలే..మీరు కబుర్లు కొనసాగించుకోండి..." అంటూ బయటకు వెళ్ళిపోయింది.

అపుడొకమ్మాయి మామూలుగా స్వరం పెంచి ఏదో అడగబోతోంటే, కీర్తన లేచి నిలబడి " సరేలేండే....ఇక ఈ పూటకి మనమూ పాటలకీ, మాటలకీ సెలవు ఇచ్చేసి...మన నెలవులకు బయలుదేరుదాం ! " అంది ఎవరి రూముకి వాళ్ళు వెళ్ళిపోవచ్చని చెప్పినట్లుగా !

****

రెండురోజుల తర్వాత ఆ ఆదివారం కీర్తన తన ఇంటికి బయలుదేరింది.

కీర్తన వాళ్ళ నాన్న తన ఆఫీసుకి కొంచెం దగ్గరగా ఇల్లు తీసుకుని మారటం వలన కీర్తన కాలేజీకి చాలా దూరమైంది. అందుకని ఆ సంవత్సరం కాలేజి హాస్టల్ లో చేరి నెలకో, రెండు నెలలకో ఓసారి ఇంటికి వెళ్ళి వస్తూ ఉంటుంది.

ఇంటికి వచ్చేసరికి...ఇంటి వాతావరణమంతా అదో మాదిరిగా ఉందనిపించింది కీర్తనకు. పెళ్ళి ప్రయత్నాల కోలాహలం లేనేలేదు.

" ఏమిటమ్మా..అంతా అదో మాదిరిగా వున్నారూ...? " తల్లిని కీర్తన అడిగింది.

ఆవిడ భారంగా నిట్టూర్చింది. " నిన్న ఏం జరిగిందో తెలుసా...ఆ పెళ్ళివాళ్ళు వచ్చి..నువ్వు ఎవరినో ప్రేమించావనీ...పెళ్ళికి ముందు నువ్వు ప్రేమించినవాడితో లేచిపోయే ప్లాన్ లో

వున్నావని వాళ్ళకి నమ్మకంగా తెలిసిందట...అందుకని అలా పరువు పోకుండా ముందే జాగ్రత్త పడుతున్నామనీ, పెళ్ళి రద్దు చేసుకుంటున్నామనీ చెప్పి వాళ్ళిచ్చిన నగలు కూడా తీసుకుపోయారే....పోతేపోనీ, ఎలాగూ నీకిష్టం లేని పెళ్ళే కదా అనుకున్నాంగానీ, నీలాంటి అమాయకురాలిపై ఇలాంటి అభాండం వేసినందుకు బాధగా ఉంది ! అందరికీ చెప్పుకున్నాక, ఇలా చేశారూ..మన పరువూ పోయిందని మీ నాన్న బాధపడుతున్నారు. " అంటూ ఆవిడ కళ్ళు తుడుచుకుంది.

" నేను ముందే చెప్పానా వాళ్ళ గురించి...అతనికి మా కాలేజీలో మంచి పేరు లేదు. రౌడీ టైపు. నేనతని మాట వినలేదని నన్నెలా దారిలోకి తెచ్చుకోవాలో తెలుసని, తగిన గుణపాఠం చెబుతాననీ ఛాలెంజ్ చేశాడు ! ఈ మాట చెబితే, మీరు నమ్మలేదు ! వాళ్ళ ఆస్తిపాస్తుల మైకం కమ్మేసింది మీకు.

వాళ్ళకేమో...పెళ్ళి చేసుకుని నా పని పడదామని అనుకున్న ప్లాను జరగదేమోనని అనుమానం వచ్చి ఉంటుంది. అందుకనే ఇలా కట్టు కథొకటి చెప్పి పెళ్ళీ రద్దు చేసుకున్నారన్నమాట ! సరే, వాళ్ళ నైజం ముందే తెలిసిందని సంతోషిద్దాం ! ఈ మాట నాన్నకీ చెప్పు...మన మంచి చెడ్డల గురించి మనం ఆలోచించుకోవాలిగానీ...పరువూ గిరువూ అంటూ అనవసర భయాలు పెట్టుకోవద్దని ! " అంది కీర్తన.

నిజమే అన్నట్లుగా ఆవిడా తలవూపి వూరుకుంది.

కీర్తన మనసులోనే నవ్వుకుంది. ' సంజనను చూడగానే కలిగిన ఆలోచనను అమలు చేయటం వలన మంచి ఫలితమే దక్కిందన్నమాట ! ఏదైనా రహస్యం తెలిస్తే...వెంటనే వాళ్ళకు చేరవేయాలనే ఉత్సుకత చాలామందికి ఉంటుందని తను ఊహించటంతో....అప్పటికప్పుడు కల్పించి చెప్పిన తన ప్రేమ కట్టు కథని నిజమని నమ్మి సంజన తమ బంధువులకి చేరవేయటంతో తనకి తెలియకుండానే పరోక్షంగా బాగానే సాయం చేసింది ! లేకపోతే...ఆ రౌడీ...ఎలా దారికి రావో చూస్తాగా, నీ పని ఎలా పట్టాలో తెలుసంటూ ఛాలెంజ్ చేస్తాడా...?! ఈ పెళ్ళికి ఒప్పుకోకపోతే, పరువు హత్య కైనా వెనుకాడను అంటూ తన తండ్రే తనని బెదిరించటమా...?! పిల్లలు ప్రేమ లేక చదువో...ఇలా యే కారణంతోనైనా పెళ్ళికి విముఖత చూపిస్తే, పెద్దవాళ్ళుగా తల్లిదండ్రులు తమకు తెలిసిన మంచీ చెడ్డా విడమరిచి చెప్పగలగాలి ! పిల్లలు చెప్పే కారణాల్నీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి ! అలా కాకుండా ప్రాణాలు తీసుకుంటామనో, తీస్తామనో బెదిరించటం తన ఉద్దేశ్యంలో మంచి పని కానేకాదు ! ఇద్దరికీ బాగానే బుద్ధి చెప్పగలిగానుగా !' అనుకున్న కీర్తనకు మనసు తేలికపడింది.

'ఇక తన ఇష్టప్రకారమే చదువు కొనసాగించి, ఉద్యోగంలో స్థిర పడిన తర్వాతే పెళ్ళి ఆలోచన చేయచ్చు ! ' అనుకుంటూ కీర్తన సంతృప్తిపడింది.

***********